నమస్తే తెలంగాణ
మహబూబాబాద్
5 | వరంగల్, శనివారం 3 మే 2025 | MAHABUBABAD


మహదేవపూర్ : ధాన్యం కొనుగోలు కేంద్రంలో వర్షానికి తడిసి ముద్దయిన ధాన్యం


గూడూరు : వర్షపు నీటిలో తడిసి ముద్దయిన రహదారిపై ఆరబోసిన ధాన్యం

# సర్కారు జాప్యం వడ్లు వర్షార్పణం

## కొనుగోళ్లు ఆలస్యమై కేంద్రాల్లోనే మగ్గుతున్న ధాన్యం


వెంకటాపూర్ : తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ములుగు-భూపాలపల్లి రహదారిపై ధర్నా చేస్తున్న రైతులు


మహబూబాబాద్ రూరల్ : మానుకోట మార్కెట్‌లో తడిసిన ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతు భిక్షం


గోవిందరావుపేట : చల్వాయిలో వరద నీటిలో కొట్టుకుపోయిన ధాన్యం


గూడూరు : అకాల వర్షానికి కొనుగోలు కేంద్రంలో నీటమునిగిన ధాన్యం


నర్సంపేట: మార్కెట్‌లో కొట్టుకుపోయిన మక్కలను ఎత్తుతున్న రైతు

- రెక్కలకష్టం వరదపాలై రైతన్న కన్నీరుమున్నీరు
- అకాల వర్షంతో కొట్టుకుపోయి అన్నదాత ఆగమాగం
- జనగామ మినహా ఉమ్మడి జిల్లా అంతటా మోస్తరు నుంచి భారీ వర్షం
- కాంటాలు పెట్టడం లేదని పలుచోట్ల రైతుల ఆందోళన
- తడిసిన వడ్లు కొనాలని డిమాండ్

**ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వ ఆలసత్వం.. రైతుకు శాపంగా మారింది. సాగునీరు అందకపోయినా ఎంతో శ్రమకోర్చి పండించిన పంటలను అమ్మేందుకు కొనుగోలు కేంద్రాలకు తీసుకొస్తే రోజుల తరబడి కాంటా పెట్టకపోవడంతో అకాల వర్షానికి ధాన్యమంతా వరదపాలవుతున్నది. కొద్దిరోజులుగా ఉమ్మడి జిల్లాలో వర్షాలు పడుతున్నప్పటికీ కొనుగోళ్ల ప్రక్రియ వేగవంతం చేయకపోవడంతో గురువారం అర్ధరాత్రి కురిసిన భారీ వర్షానికి కొనుగోలు కేంద్రాలతో పాటు కల్లాల్లో ఆరబోసిన వడ్లన్నీ కొట్టుకుపోయి రైతులకు కన్నీరే మిగిల్చింది. మొన్నటిదాకా అదునుకు సాగునీరందించక అరిగోస పెట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ఇప్పుడు కేంద్రాల్లో కోతలు, కొర్రీలు తప్ప కనీస వసతులు కల్పించకపోవడమే గాక సమయానికి కాంటాలు పెట్టక తమను నిండా ముంచిందని అన్నదాతలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికైనా కాంటాలు పెట్టడంతో పాటు తడిసిన ధాన్యమూ కొనాలంటూ పలుచోట్ల రోడ్డెక్కి ఆందోళనకు దిగారు.**

**- నమస్తే నెట్‌వర్క్, మే 2**

ఆరుగాలం శ్రమించి పండించిన పంట అమ్ముకునేందుకు సైతం అవస్థలు పడాల్సి వస్తున్నదని, తమ కష్టం అధికారులకు పట్టదా? తమను నిండా ముంచేస్తారా? అంటూ రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కొనుగోళ్లలో జాప్యం ఎందుకని, వెంటనే కాంటాలు పెట్టాలని డిమాండ్ చేస్తూ ఆందోళనకు దిగారు. ఈదురుగాలులు, అకాల వర్షాలతో ధాన్యం తడిసి తీవ్రంగా నష్టపోతున్నామని మండిపడ్డారు. డబ్బులిచ్చిన భూస్వాములకు మాయిశ్చర్ రాకున్నా ఒకటి, రెండు రోజుల్లో కాంటాలు పెడుతున్నారని, తమలాంటి చిన్న రైతులను పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నా రు. ఇందులో భాగంగా ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం పాపయ్యపల్లి, సింగరకుంటపల్లికి చెందిన రైతులు పాపయ్యపల్లి కొనుగోలు కేంద్రం లో వెంటనే విక్రయాలు చేపట్టాలని ములుగు-భూపాలపల్లి రోడ్డుపై ధర్నా చేపట్టారు. దీంతో రెండు వైపులా భారీగా ట్రాఫిక్ జాం కావడంతో స్థానిక ఎస్సై సతీశ్ అక్కడకు చేరుకొని అధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. అలాగే మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేటలో ఏర్పాటు చేసిన పీఏసీఎస్ కొనుగోలు కేంద్రంలో మండల కేంద్రానికి చెందిన రైతు అంకం నాగయ్య ఆందోళనకు దిగాడు. ఐదు రోజుల క్రితం తేమ 13 శాతం ఉందని చెప్పి ఇప్పటికీ కాంటాలు పెట్టడం లేదని ఆరోపిస్తూ వడ్ల కుప్పపై సానిటైజర్ చల్లి తగుల బెట్టేందుకు యత్నించగా రైతులు అడ్డుకున్నారు. గన్నీ బస్తాలు లేవని, టోకెన్లు ఇవ్వాల్సిన ఏఈవోలు అందుబాటులో ఉండడం లేదంటూ సిబ్బందిని నిలదీశారు. కేంద్రంలో వసతులు కల్పించాలని, డబ్బులు వసూలు చేస్తున్న సిబ్బందిపై చర్యలు తీసుకొని కాంటాలు పెట్టాలని డిమాండ్ చేశారు.


ఏటూరునాగారం : కొనుగోలు కేంద్రంలో వడ్ల కుప్పలపై కప్పిన టార్పాలిన్ షీట్లపై నిలిచిన నీళ్లు


కురవి : అర్హులకు ఇండ్లు ఇవ్వాలని తట్టుపల్లి జీపీ ఎదుట ఆందోళన చేస్తున్న అఖిలపక్షం నాయకులు

# అర్హులకు అన్యాయం అనర్హులకు అందలం!

## 'ఇందిరమ్మ ఇళ్ల' లబ్ధిదారుల ఎంపికలో గందరగోళం

**అర్హత ఉన్న ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించినా క్షేత్రస్థాయిలో మాత్రం లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ అందుకు భిన్నంగా ఉంటున్నది. అసలైన పేదల పేర్లు కాకుండా అనర్హుల పేర్లు జాబితాలో చేరిపోతుండడం, ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ నాయకులకే ఇల్లు కట్టబెట్టి అర్హులకు అన్యాయం చేస్తున్నారంటూ రోజుకో చోట జనం ప్రభుత్వ కార్యాలయాలతో పాటు రోడ్డెక్కి నిరసనలు తెలుపుతుండడంతో అంతటా గందరగోళం నెలకొంది. అంతేగాక ఇందిరమ్మ కమిటీలోని నాయకులకు డబ్బులు ఇచ్చిన వారికే ఇళ్లు మంజూరు చేస్తున్నారంటూ సర్వే వచ్చిన అధికారులను జనం నిలదీస్తుండడం సర్వసాధారణమైంది. ఇదిలా ఉంటే కొన్ని నియోజకవర్గాల్లో అధికారులకు తెలియకుండానే జాబితాలు సిద్ధమవుతున్నట్లు తెలుస్తుండగా, అర్హులకు మాత్రం ఎదురుచూపులు తప్పడం లేదు.**

**- మహబూబాబాద్/జనగామ, మే 2(నమస్తే తెలంగాణ)**

- జాబితాలో చోటుదక్కక నిరుపేదల్లో అయోమయం
- ఎక్కడికక్కడ గ్రామసభలను అడ్డుకుంటున్న జనం
- పేదలను కాదని.. నాయకుల పేర్లా అంటూ నిలదీతల పర్వం
- అధికారులకు తెలియకుండానే ఎంపిక జాబితాలు?

కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారెంటీల్లో ప్రతిష్టాత్మకంగా చెప్పుకొంటున్న ఇందిరమ్మ ఇండ్ల పథకం ఆదిలోనే అట్టర్‌ప్లాప్ అయింది. జనగామ జిల్లాలో నియోజకవర్గం యూనిట్‌గా ఒక్కో నియోజకవర్గానికి 3,500 చొప్పున గృహాలు మంజూవుతున్నాయి. ఒక్కో నియోజకవర్గంలో ఎనిమిది పైలట్ గ్రామాలు పోగా మిగిలిన గ్రామాలకు గృహాలకు లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు సర్వే జరుగుతున్నది. అయితే గతంలో ఇల్లు మంజూరైనా నిర్మాణం పూర్తిచేయకుండా ఇల్లు కొనుగోలు చేసి నివాసం ఉంటున్న దరఖాస్తుదారుడి పేరు అర్హుల జాబితాలో చేరింది. ఇలా చాలామంది అనర్హుల పేర్లు ఎల్-1, ఎల్-2లో ఉన్నాయి. అదీ గాక కుటుంబ సభ్యుల్లో ఒకరు ప్రభుత్వ ఉద్యోగిగా ఉన్న వారి పేర్లు అర్హుల జాబితాలోకి ఎక్కించారు. అంతేగాక ఇతర రాష్ర్టాలు, పక్క జిల్లాల్లో ఆస్తి, పాస్తులుండి స్థానిక ఆధార్‌కార్డుతో దరఖాస్తు చేసుకున్న వారి పేరు జాబితాలో ప్రత్యక్షమవుతుండడంపై ప్రజలు అధికారులను నిలదీస్తున్నారు. తాము చెప్పిన వారిని లబ్ధిదారులుగా ఎంపిక చేయాలని కాంగ్రెస్ నాయకుల నుంచి వస్తున్న ఒత్తిడితో అధికారులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం సర్వే చేస్తున్న జాబితాలో తమకు సమాచారం లేకుండానే పేర్లు ఎలా వచ్చాయో తెలియని గందరగోళ పరిస్థితి ఉందని వారు అంటున్నారు.

***అధికారుల నిలదీతలు..***

ఇందిరమ్మ ఇళ్ల అర్హులను గుర్తించేందుకు జనగామలో ఇటీవల మరో సర్వే చేపట్టారు. ఇప్పటికే మూడుసార్లు వివిధ జాబితాలతో లబ్ధిదారులను ఎల్-1, ఎల్-2గా గుర్తించారు. ప్రధానమంత్రి ఆవాస యోజన వర్తింపజేసేందుకు వచ్చిన జాబితాపై సర్వే ప్రారంభించి మధ్యలో నిలిపివేశారు. వెబ్‌సైట్‌లో 418 మంది వివరాలు ఉంటే అదనంగా 80 పేర్లు జాబితాలో చేరాయి. వారి వివరాల కోసం వార్డుల్లో ఎక్కడ వెతికినా కనిపించలేదు. ఇంతలో ఇందిరమ్మ కమిటీల సిఫారసుతో 500 మందితో తాజాగా మరో జాబితా వచ్చింది. లబ్ధిదారుల జాబితాను వార్డుల వారీగా వేరు చేసి అధికారులతో సర్వే చేయించి రూపొందించిన లబ్ధిదారుల వివరాలతో అధికారులు మళ్లీ తిరిగి పరిశీలిస్తున్నారు. గతంలోని వివరాలకు, ప్రస్తుత జాబితాలోని వివరాలకు పొంతన లేకపోవడంతో దరఖాస్తుదారుల్లో ఆందోళన వ్యక్తమవుతున్నది.

### ఇళ్ల కోసం తప్పని ఎదురుచూపులు

మహబూబాబాద్ జిల్లాలోని మహబూబాబాద్, డోర్నకల్ నియోజకవర్గాలకు 3500 చొప్పున 7వేల ఇళ్లు మంజూరయ్యాయి. అయితే గ్రామసభలు నిర్వహించిన సమయంలో ఒక జాబితా ఉంటే.. ఇల్లు వచ్చిన తర్వాత అందులో చాలామంది అర్హులను తొలగించి కేవలం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను మాత్రమే అర్హుల జాబితాలో చేర్చారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అయితే జాబితాలో పేరు వచ్చిందని చాలామంది ఉన్న గుడిసెలు, పెంకుటిళ్లు, రేకులు తీసేసి ఇండ్లు నిర్మించుకుందామని ఎదురుచూస్తున్నారు. అర్హుల జాబితాలో పేర్లు లేకపోవడంతో చాలామంది నిరాశకు గురవుతున్నారు. మొదటి విడతలో గ్రామసభ నిర్వహించినప్పుడు ఒక గ్రామానికి 150 ఇళ్లు మంజూరయ్యాయని చెప్పిన అధికారులు ఇప్పుడు కేవలం 15 నుంచి 20 ఏళ్లు మాత్రమే వచ్చాయనడంతో నిజమైన లబ్ధిదారులు కంగుతిన్నారు. ఇప్పటికైనా అధికారులు అర్హులను జాబితాలో చేర్చి ఇండ్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

### వర్షాలకు కూలింది.. అయినా ఇల్లు ఇయ్యలే



పోయిన ఏడాది ఆగస్టులో, సెప్టెంబర్ నెల్లో కురిసిన భారీ వర్షాలకు నా ఇల్లు మొత్తం కూలిపోయింది. ఇల్లు కూలిన వా రం లోపట నెల్లికుదురు ఎమ్మార్వో దగ్గరికి పోయి అర్జీ పెట్టుకున్నా. ఇందిరమ్మ ఇల్లు ఇస్తా అన్న డు. ఆ తర్వాత ప్రజాపాలన, గ్రామసభలో ఇందిరమ్మ ఇల్లు కోసం దరఖాస్తు ఇచ్చిన. ఎవరెవరికో ఇల్లు ఇచ్చిన్రు.. నాకు మాత్రం రాలే. కలెక్టర్ సారూ నాకు కూడా ఇల్లు ఇప్పించాలని కోరుతున్నా.

**- బొల్లు ముత్తయ్య, బ్రాహ్మణ కొత్తపల్లి, నెల్లికుదురు మండలం, మహబూబాబాద్ జిల్లా**

# భూస్వాములకే ఇందిరమ్మ ఇండ్లా?

- అర్హులకు కేటాయించాలి.. లేకుంటే ఊరుకోం
- పెద్దనాగారం, తట్టుపల్లి గ్రామస్తుల ధర్నా

నర్సింహులపేట/కురవి, మే 2: భూస్వాములు, ఎకరాల భూమి ఉన్నవారికే ఇందిరమ్మ ఇండ్లా ?.. అర్హులకు కేటాయించాలని, లేకుంటే ఊరుకోమని పెద్దనాగారం, తట్టుపల్లి గ్రామస్తులు హెచ్చరించారు. అర్హులకు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని కోరుతూ శుక్రవారం నర్సింహులపేటలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట పెద్దనాగారం లబ్ధిదారులు, కురవి మండలం తట్టుపల్లి జీపీ కార్యాలయం ఎదుట అఖిలపక్షం ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో యాకయ్యకు వినతి పత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామసభలో తమ పేర్లు చదివారని, ఇందిరమ్మ కమిటీ వచ్చిన తర్వాత అవి లేకుండాపోయాయని అన్నారు. అర్హులైన వారికి కాకుండా లీడర్లు కుమ్మక్కై తమకు అన్యాయం చేస్తున్నారని తెలిపారు. తట్టుపల్లిలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు, అధికారులు 20 మందిని ఎంపిక చేశారని, భూమి ఉండి, వేరే గ్రామాల్లోని వ్యక్తుల పేర్లు తీసివేయాలన్నారు. గ్రామంలో అర్హత కలిగిన పేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని, లేకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మందు బద్రీనాథ్, వినోద్ కుమార్, మల్లయ్య, శ్రీను, వెంకన్న, ఉప్పలయ్య, రాములు, పర్శరాములు, అఖిలపక్షం నాయకులు డీవై గిరి, మాజీ ఎంపీటీసీ పోతుగంటి వెంకన్న, అంతటి సురేశ్, కొత్త ప్రభాకర్, బోనాల రవి, మదనాచారి పాల్గొన్నారు.


నర్సింహులపేట ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న పెద్దనాగారం గ్రామస్తులు



డోర్నకల్ : చాప్ల తండా వద్ద గాలి దుమారానికి విరిగిన బొప్పాయి చెట్లు, గోవిందరావుపేట : చల్వాయిలో నేలవాలిన వరి పంటలో నిలిచిన నీరు

# అకాలం.. అతలాకుతలం

- ఈదురుగాలుల బీభత్సం
- భారీగా కురిసిన వర్షం
- నేలవాలిన వరి.. రాలిన మామిడి
- ఎగిరిపోయి ఇండ్ల పైకప్పులు
- కూలిన చెట్లు, విరిగిన విద్యుత్ స్తంభాలు

*ఉమ్మడి జిల్లాలోని పలు మండలాల్లో ఈదురు గాలులతో కూడిన వర్షం బీభత్సం సృష్టించింది. మహబూబాబాద్, ములుగు, భూపాలపల్లి, వరంగల్, హనుమకొండ జిల్లాల్లో గురువారం రాత్రి నుంచి శుక్రవారం తెల్లవారుజాము వరకు ఇది కొనసాగింది. దీంతో కోతకొచ్చిన వరి పంట నేలవాలగా, మామిడి కాయలు రాలిపోయాయి. గాలుల ధాటికి రోడ్లపై భారీ చెట్లు కూలిపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వందల సంఖ్యలో విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. దీంతో పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఇండ్ల పైకప్పులు ఎగిరిపోవడంతో బాధితులు రాత్రంతా జాగారం చేయాల్సి వచ్చింది. మార్కెట్లు, కొనుగోలు కేంద్రాలు, కల్లాల్లో ఆరబోసిన ధాన్యం, మక్కలు, మిర్చి తడిసిపోయాయి. పలు కొనుగోలు కేంద్రాల్లో వర్షపు నీటిలో ధాన్యం మునగడంతో పాటు కొట్టుకుపోవడంతో రైతులకు తీవ్ర నష్టం మిగిలింది. నీళ్లను తొలగించేందుకు రైతులు అష్టకష్టాలు పడ్డారు. మహబూబాబాద్, భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో వర్ష ప్రభావం ఎక్కువగా ఉంది. మహబూబాబాద్ జిల్లాలోని మహబూబాబాద్, కురవి, డోర్నకల్, గూడూరు, బయ్యారం, గార్ల, మరిపెడ, భూపాలపల్లిలోని మహదేవపూర్, కాటారం, ములుగులోని ఏటూరునాగారం, గోవిందరావుపేట, వెంకటాపూర్, వరంగల్‌లోని నర్సంపేట, చెన్నారావుపేట, ఖానాపురం, హనుమకొండ జిల్లాలోని శాయంపేట, కమలాపూర్ మండలాల్లోని పలు గ్రామాలు ఈదురుగాలులు, వర్షం బారిన పడ్డాయి.*

**- నమస్తే నెట్‌వర్క్, మే 2**


నర్సంపేట : పర్శనాయక్‌తండాలో తడిసిన మిర్చిని చూపుతున్న రైతులు


బయ్యారం: ఈదురు గాలులకు రోడ్డుపై పడిన ఇంటి రేకులు


నర్సంపేటలో ఇంటిపై విరిగి పడిన విద్యుత్ స్తంభం


గోవిందరావుపేట : చల్వాయిలో వడగండ్ల వానతో నేలరాలిన ధాన్యం


కురవి : ఖమ్మం ప్రధాన రహదారిపై కూలిన చెట్టు


ఖానాపురం : మనుబోతులగడ్డలో రోడ్డుకు అడ్డుగా పడిన భారీ వృక్షం

మరిన్ని వార్తలు 8లో..